



# కోమలాదేవి
# ఒక్క గంట

మూసివున్న తలుపుల ఇవతల నుంచుని భయంతో నేలచూపులు చూస్తోంది నీరజ. ఆ తలుపులు తెరుచుకుంటాయి. ఆమె భవిష్యత్తు అవలివైపున వున్న వ్యక్తిమీద ఆధారపడి ఉంది. ముళ్ళ కంపమీద పడ్తుందో – లేదా పూలబాట మీద పయనిస్తుందో!

తలుపు చప్పుడైంది. భయంతో గుండెలను అదిమిపట్టుకుంటున్నట్లు రెండు చేతులను ఎదపై ఉంచుకుందామె. అదృశ్యశక్తి ఆమెలోని శక్తినంతా పీల్చి వేస్తున్నట్లు గుర్తుగా ఆమెముఖం తెల్లగా మారిపోయింది!

తలుపులు తెరుచుకున్నాయి.

ఆత్రంగా - భయంతో కళ్ళెత్తి చూచింది.

ఎదుట నుంచున్న వ్యక్తిని చూచిన తరువాత నీరజ ముఖంలో అతిస్వల్పంగా మార్పు కానవచ్చింది. "హమ్మయ్య" అన్న ఒక విధమైన తేలికైన నిట్టూర్పు ఒదిలింది.

"ఎవరు కావాలండీ?" ఆమె కంఠంలో విసుగులేదు. అతి మామూలుగ ప్రశ్నించింది.

నీరజ కళ్ళెత్తి ఆమె కళ్ళలోకి చూసింది. ఉండే ముప్పై ఉంటాయి. సన్నగా నాజూకుగా ఉన్నా పెద్దరికపు చిహ్నాలు ఆమె ముఖంలో వస్త్రధారణలో తెలిసిపోతున్నాయి.

"ఉమానాథ్‌గారు ఇంట్లో ఉన్నారా అండీ?" తడబడ్తూ అడిగింది నీరజ.

"లేరు. ఈ వేళప్పుడు ఆఫీసులో ఉంటారు" నీరజను అంచనా వేస్తూ అంది.

"మీరు? లోపలికి రావచ్చునా?"

ఆమె అడ్డంతొలగింది. కాని అంతలోకి భయం వేసింది. బాగ్‌లోనుంచి కత్తి బైటికితీసి బెదిరించదు కదా!

"మీరు?" ఆత్రంగా అడిగింది నీరజ.

"వారి భార్యను."

"హమ్మయ్య...మీతో ముఖ్యవిషయం మాట్లాడాలని వచ్చానమ్మా."

ఎందుకైనా మంచిదని ఆమె ఆ గదిలోని అవతల తలుపు దగ్గరకెళ్ళి నుంచుంది. నీరజ బెదిరిస్తే గభాల్న తలుపు మూసుకోటానికి వీలుగా ఉండటానికి.

"కూర్చోండి" అందామె. ఇద్దరిమధ్య దూరం బాగా ఉన్నచోట కుర్చీ చూపింది.

నీరజ అంది "నాపేరు నీరజ. బి. ఏ. పాసయ్యాను. టైప్, షార్ట్‌హాండ్ నేర్చుకున్నాను. మా నాన్నగారు పోయి నాలుగు సంవత్సరాలైంది. మా అమ్మ అతి కష్టంతో చదివించింది. నాకు ఒక తమ్ముడు, ఒక చెల్లి ఉన్నారు. ఏడాదిగా ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాను. డబ్బు, లేని పలుకుబడి నాకు ఎక్కడా దొరకటంలేదు. డబ్బు పలుకుబడీ లేకపోతేనేం — ఉన్నదేదో ఇచ్చి ఉద్యోగం సంపాదించుకో- అని సలహా ఇస్తారు మగవారు. నా కది నచ్చలేదు. పస్తులైనా ఉంటాను గాని ఆ పనిమాత్రం చెయ్యనని చెప్పాను. ఐతే నీ పాట్లు నువ్వు పడు అని నన్ను తిరగ్గొట్టేవారు. నా ఆశయాలను నిల్పుకుని నేను, అమ్మ పస్తులుండటానికి సిద్ధంగా ఉన్నాం కాని తమ్ముడు, చెల్లి చిన్నవాళ్ళు — వాళ్ళకు అర్థంకాదు. చెప్పలేము. మా పరిస్థితులు ఎంతో అధ్వాన్నంగాఉన్నాయి. అమ్మ అంట్లుతోమటానికి కూడ సిద్ధంగా ఉంది. కాని ఆ వచ్చే పాతిక ముప్పై ఏ మూలకమ్మా? ఇంతలో సింగ్ అండ్ రావు కంపెనీలో ఉద్యోగం ఖాళీగా ఉందని తెలిసింది. అప్లైచేశాను. వెళ్ళి కనబడి వచ్చాను."

ఇక తరువాత చెప్పటానికి ఇష్టంలేనట్లు

ఒక్కసారి ఆమె కళ్ళలోకి దీనంగా చూచి తల వంచుకుంది. రెప్పలు భారంగా మూసుకున్నాయి. చెక్కిళ్ళమీద కన్నీరు ధారకట్టింది. ఆమె ఆందోళనతో కాస్త ముందుకు వొంగింది నీరజ ఆమెకు దూరంగా ఉన్నా ఆ చిన్నచర్య ఆమెలోని ఆత్రతను బహిర్గతపర్చింది.

"ఏమన్నారు? అయ్యగార్ని కలవలేక పోయావా?"

కాదన్నట్లు తలూపింది.

ఆ నిశ్శబ్దం— ఆమె దుఃఖం — ఆమె కేసి చూడకుండా తలవంచుకున్న వైనం చూచి ఆమెకు ఆశ్చర్యం వేసింది.

"నీరజా—అట్లా ఏడుస్తూ కూర్చుంటే ఎట్లాగమ్మా. ఏం జరిగింది?"

"ఈ శరీరాన్ని అపవిత్ర పర్చుకుంటే దొరుకుతుందన్నారు."

"ఎవరు?" ఆమె గంభీరంగా అడిగింది.

నీరజ మాట్లాడలేదు.

ఆమె నీరజకేసి ఈమారు పరీక్షగా చూచింది. నీరజలో ఎంత అందం ఉంది? ఆమె అందాన్ని చూచి ఎవరు ఆకర్షితులై ఈ తుచ్ఛమైన కోరిక కోరారు?

నీరజకేసి చూస్తూ ఆమె నిట్టూర్చింది, తన పిచ్చికాని అందంతో 'దాన్ని' ముడి పెట్టటం ఏమిటి? ఆమె యౌవనంలో ఉన్న ఆడది. అది చాలు. అవసరంలో ఉన్నవ్యక్తి ఆ అవసరం తీరటానికి గడ్డి తిన మన్నా తింటాడని ఇటువంటి కోరిక కోరటానికి వెనుదీయరు. ఇంతకు అత దెవరు? ఆ ఆఫీసులో ఇంటర్వ్యూ చేసే వారు ముగ్గురు. ఈ ముగ్గురిలో 'అతడు' ఎవరు?

నీరజ మాట్లాడకుండా వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఆమె గుండెలు ఝల్లుమన్నాయి. 'అతడు' ఎవరు? అన్న ప్రశ్నకు జవాబు దొరకటమే కారణం.

"హే ప్రభూ" అంటూ ఆమె తల పట్టుకుంది. "అతడు" తన భర్త 'ఉమా'యే. సందేహంలేదు....

ఉమ: తన భర్త — తనను పువ్వుల్లో పెట్టి పూజించే భర్త — తన కనుసన్నల్లో మెదిలేవాడు — తనను ప్రాణాధికంగా ప్రేమించేవాడు.... తప్పు... తప్పు...తన ఉమా ఎన్నటికీ అలాంటి నికృష్టమైన పని చేయడు.

"ఎవర్ని కలుసుకున్నావు? ఏం చెప్పారు? చెప్పు" ఆమె గద్దించినట్లు అడిగింది.

గంభీర వదనయై నుంచుని తనను అడుగుతుంటే నీరజ నాలుక సడలింది. చెప్పాలి. అందుకే తను వచ్చింది.

"మొన్న వెళ్ళానమ్మా. తిన్నగా ఆఫీసుగదిలోకి తీసుకెళ్ళారు. ఉమానాథ రావుగార్ని కలిశాను. నా కష్టాలన్నీ చెప్పు కున్నాను. చూస్తాను అని పంపించి వేశారు. ఈరోజు ఉదయం ఆఫీసుకు రమ్మని కబురుచేశారు. వెళ్ళాను. ఒక ఉత్తరం అందించాడు ప్యూన్. అది చదువు

కున్న తరువాత ఉమానాథరావు గదిలోకి వచ్చారు. నా చేతిలోఉన్న ఉత్తరం తీసుకున్నారు. ఆలోచించుకుని ఎల్లుండి ఈ అడ్రసుకు రమ్మన్నారు" నీరజ చిన్న పర్స్ తీసి అడ్రస్ కాగితం ఇచ్చింది.

అదొక హోటల్ పేరు కాదు. మామూలు ఇంటి అడ్రస్. ఆమె నొసలు చిట్లించి ఆలోచించింది.

ఆ ఉత్తరంతో ఏమిటి ఉన్నదో ఆమెకు తెలుసు. ఆమె ముఖం చలువ రాయిలా పాలిపోయింది. అయినా ఆమెకు హృదయంలో ఒక మారుమూల చిన్న అనుమానం అలాగే నిల్చివుంది.

గబగబ వెళ్ళి ఫోటో తెచ్చి చూపించింది.

"వీరేనా?"

"ఔనమ్మా....వీరే...మాట్లాడుతుంటే పెదవి చివర ఎడంవైపు కొద్దిగా వంగుతుంది. మా నాన్నగార్కి కూడ అలాగే వంగేది." అంది మెల్లగా.

ఆ మాట వినటంతో ఆమె నోట "ఉమా!" అన్న ఆర్తనాదం వినబడింది. రెండుచేతుల్లో ముఖం కప్పుకుందామె. నీరజకు భయం – జాలి వేశాయి. అమెను సోఫాలో కూర్చోబెట్టి తాను క్రింద కూర్చున్నది.

కొంతసేపటికి ఆమె తెప్పరిల్లి దిగులుగా తనవైపు చూస్తోన్న నీరజను చూచింది.

"అమ్మా – మీ బాధను అర్థంచేసుకోగలను. నా బాధను మీరు అర్థంచేసుకోగలరు. మీరే నాకు సహాయం చేయాలి. ఉట్టి చేతులతో ఇంటికి వెళ్ళలేను. అమ్మ వేయికళ్ళతో ఎదురుచూస్తూ ఉంటుంది." అంది నీరజ గాద్గదికంగా.

"నీరజా–అతడు నిన్ను కోరాడంటే... ఆ కోరిక తీరవలసిందే. నీకు పని దొరకవలసిందే."

"అమ్మా" అంది నీరజ. ఆమెలో ఉన్న ఆశాకిరణం ఒక్కమాటు మాయమైపోయింది. ఆమె నవ్వింది.

తనను ఆటపట్టించి నవ్వుతోందా ? తన సంకటంలో ఆమె ఆనందం ఉన్నదా. చివ్వున తలఎత్తి చూచింది.

ఆమె నవ్వుతోంది. ఆ ముఖంలో పైశాచికానందం లేదు. కళ్ళలో సన్నని నీటిపొర. "లే....ఇలా నా ప్రక్కలో కూర్చో....నెమ్మదిగా ఆలోచించు .... పురుషుకు అలాంటి కోరిక కోరాడంటే అతడిలో పశువాంఛ తలెత్తిందన్నమాట. అది తీరాలి. నీకు ఉద్యోగం రావాలి.... విను...."

నీరజ విసురుగా లేచింది. క్రోధంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి.... ఆడదాని శత్రువు ఆడదే. భర్త కోరిక తీర్చాలి....మరో ఆడది ఏమైతేనేం .... అనుకుంటుంది.

"నీరజా– నీకు ఈ విధమైన కోపం వస్తుంటే నా కెంతో సంతోషంగా ఉంది. నీవు మామూలు పిల్లవు కావు. కూర్చో.



సావధానంగా విను....ఉండు.... ముందు కాఫీ త్రాగుదాం" అని ఆమె లోపలి కెళ్తూ నీరజనుకు కూడా తీసుకెళ్ళింది. ఇద్దరు కాఫీతాగారు. ఆమె నీరజకు బ్రెడ్-జాం పెట్టింది. అయిష్టంగా ఉన్నా నీరజ తిన్నది. ఆ తరువాత చాలాసేపు ఆమె మాట్లాతూనే ఉంది. నీరజకు ధైర్యం చెబుతూనే ఉంది. ఆ తరువాత టాక్సీ తీసుకుని రాణీగంజ్‌లో ఉన్న నీరజ ఇంటికెళ్ళి చూచింది. నీరజ తల్లిని చూచింది. వారి దీనపరిస్థితిని చూచింది. నీరజ ఏమీ అబద్ధం చెప్పలేదన్న తీర్మానానికి వచ్చిన తరువాత ఆమె మనసు కుదుటపడింది. నీరజ చేతిలో రెండు వందల రూపాయలు పెట్టి వెళ్ళిపోయింది.

వారంరోజులు గడిచిపోయాయి.

నీరజ చేతిలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉంది. ఆ కాగితాన్ని చూస్తుంటే దుఃఖం పుట్టుకువచ్చింది. ఎంత శ్రమపడి ఎంతచేస్తే ఈ కాగితం చేతికి వచ్చింది! తను తన సర్వస్వం కోల్పోయినట్లే కదా! ఈ ఆర్డర్ అర్థం? ఆ తలంపుకే ఆమె ఒళ్ళు జలదరించింది.

తల్లికి ఆర్డర్ చదివి వినిపించి ఆమెను

కావిలించుకుని ఏడ్చింది నీరజ. తల్లి ఆమె వెన్ను నిమురుతూ ఓదార్చింది.

"వెళ్ళు. మొదట- ప్రమీలమ్మగార్కి- చెప్పు. చాల సంతోషిస్తారు" అంది తల్లి.

నీరజ చీర మార్చుకుని హైద్రాబాద్ వెళ్ళింది. ప్రమీలకు ఆర్డర్ చూపింది. ఆమె చాలా సంతోషించింది. కన్నీటితో కృతజ్ఞతలు చెప్పుకుని నీరజ వచ్చేసింది.

"అమ్మా - ప్రమీలమ్మ చాలా ఉదాశీనంగా ఉన్నారు."

"ఔనమ్మా — భర్త తనను మోసం చేస్తున్నాడని తెలిసిన ప్రతి ఆడది అలాగే ఉంటుంది. ఇది ఎప్పటినుండి జరుగుతున్నదో ఆమెకు తెలీదు. ఎప్పుడు ఆగుతుందోకూడ ఆమెకు తెలీదు. తనకీ విషయం తెలియనట్లు ఊరకుండాలి. అతడి ప్రేమానురాగాలన్నీ నటన అని తెలిసి భరించాలి. అది ఘోరం!

నీరజ ఆఫీసుకు వెళ్ళింది.

అందరి కళ్ళు తనమీదనే ఉన్నట్లు భావించింది. ఆ చూపులు ఆమెను చీల్చి చెండాడుతున్నట్లుగా ఉన్నయి. ఎక్కడ ఇద్దరుముగ్గురు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నా ఆ సంభాషణ తనను గూర్చే అని ఆమె విశ్వాసం. సూటిగా ఎవ్వరిదెస చూడలేని బలహీనత ఆమెనావహించింది. గంభీరంగా ముభావంగా ఆఫీసర్ దగ్గరకెళ్ళింది.

ఆయన చిరపరిచితుడిలా మందహాసం చేస్తూ "కూర్చో" అన్నాడు.

నీరజ తలవంచుకున్నది. "జాయిన్ కాకముందు మీకు కనబడాలని వచ్చాను. అది రివాజు వెళ్తాను సార్" అంది.

అతడి తలంపులలో నీరజ ఉంది. ఆమె ద్వారా పొందిన మధురమైన అనుభూతి అతడిని ఇంకా స్పందింపజేస్తోంది.

"రివాజుగా వచ్చి కనబడటంకాదు నీరజా.....మరెప్పుడైనా....."

"సార్" ఆమె గంభీర వదనంతో చివ్వున లేచి నుంచున్నది.

"మీరు మన ఒప్పందాన్ని మర్చిపోతున్నారు. ఒక్క- గంటకు-ఈ ఉద్యోగం ఇస్తానన్నారు. ఆ తరువాత ఆ ప్రస్తావన తీసుకురానని మాట ఇచ్చారు. మరొక సారి.....మరెప్పుడైనా అన్న ప్రశ్న మరి రాకూడ దన్నప్పుడు అంగీకరించారు. ఆర్డర్ చేతిలో పడకముందు మిమ్మల్ని నమ్మి మీ ఇష్టప్రకారం చేశాను. మీరు మాట ఇచ్చినప్పుడు విశ్వసించాను. మాట తప్పకండి సార్. ప్లీజ్."

అతడు నవ్వాడు. ఆ నవ్వు నిర్లక్ష్యంగా ధ్వనించింది.

"ఓ.....కె.....వెళ్లు.....ఫణిగారు అన్నీ చెబుతారు..... జాగ్రత్త..... ముసలివాడని చనువుగా ఉండకు....." నీరజ వెళ్ళిపోయింది.

"పూర్‌గాళ్..... ఎంతకాలం ఉంటుందలాగ! మరొకసారి అనేమాట లేదని ఎంత నమ్మకంగా అంటుంది.....ఒకసారి కాలుజారటానికి సమ్మతించాక ఇంకేమి

టున్నది....." అతడి మధురోహలనుండి బయటకి లాగుతూ ఫ్యాన్ వచ్చాడు. అతడు తన పనిలో నిమగ్నమయ్యాడు.

మొదటి జీతం అరువందలపది అందు కని సరాసరి ప్రమీలమ్మగారింటి కెళ్ళింది నీరజ. ఆమె ఇచ్చిన రెండువందలను కొద్దికొద్దిగా అప్పు తీర్చాలని ఆమె ఉద్దేశం. కాని అందు కామె అంగీకరించ లేదు. నీరజ ప్రేమతో యిచ్చిన పండ్లు పూవులు తీసుకున్నదామె. నీరజ మరో మారు కృతజ్ఞతలు చెప్పి ఇంటికి వెళ్ళి పోయింది.

నాల్గు సంవత్సరాలు గడిచిపోయాయి. తమ్ముడికి రైల్వేలో బుకింగ్ క్లర్క్‌గా చిన్న పల్లెకు వేశారు. చెల్లి ఇంటర్ పాస యింది. అప్పుడు నీరజకు కులశేఖర్‌తో పరిచయమైంది. అతడు తమ ఇంటి ప్రక్కన ఉన్న ఇంట్లో అద్దెకుండేవాడు. ఎల్.ఐ.సిలో ఆఫీసర్‌గా ఉండేవాడు. చెల్లెంద్ర, తమ్ముళ్ళ బాధ్యతలు తీరే సరికి అతడికి ముప్పైరెండేళ్ళు వచ్చే శాయి. ఒకనాడు నీరజ తల్లి దగ్గరకు వచ్చి తన్ను తాను పరిచయం చేసుకున్నాడు. మరో పదిరోజులు పోయాక తల్లిని పంపించాడు. నీరజతల్లి చాల సంతోషించింది.

ఈ విషయాలన్నీ ఏనాటికానాడు తల్లి నీరజతో చెబుతూనే వుంది. కాని నీరజకు ఒకవిషయం భయంగానే ఉంది. తన చెల్లి బాధ్యత ఉంది. కులశేఖర్‌ను పిలిపించి నీరజ తన అనుమానం వెల్లడించింది. ఆమె చదువు బాధ్యత తానే వహించి ఉద్యోగం దొరికేవరకు పోషించే బాధ్యత తనదే కనుక అతడు అంగీకరిస్తే అభ్యంతరం లేదని చెప్పింది. కులశేఖర్ దానికి అంగీకరించాడు. ఆ తరువాత నీరజ కులశేఖర్‌తో అంది. "ఈ పెళ్ళికి ముందర మీకు కొన్ని విషయాలు చెప్పవలసిఉంది. పెళ్ళయిపోయిన తరువాత కొన్ని విషయాలు మీ చెవినిపడితే మీరు నన్ను వొదిలి వెళ్ళిపోగలరు."

"చెప్పండి....." అన్నాడు కులశేఖర్ కాస్త ఆందోళనగా.

"నా నోట విని మీరు గ్రహించ గలరా? విశాల హృదయంతో అర్థంచేసు కుంటారా? నేను చెప్పే విషయాలను యదార్థమని నమ్మటానికి నాపై మీకు అంత విశ్వాసం ఏర్పడిందా?"

"మీరు చెప్పేదానిపై ఆధారపడి ఉంటుంది" అన్నాడు సీరియస్‌గా.

"కాని నేను చెప్పబోయే విషయం ఎంతో రహస్యమైనది. ముగ్గురికి తప్ప ఇంకెవరికి తెలియదు. నాల్గో వ్యక్తిగా మీకు తెల్పటం నా విధి. కాని ఒకవేళ ఆ విషయాన్ని మీరు నమ్మకపోయినట్లైతే ఆ రహస్యాన్ని రహస్యంగానే ఉంచి వేయగలరా? ఉంచుతానని వాగ్దానం చేస్తారా?"

కులశేఖర్ ఇబ్బందిగా చూచాడు. నీరజకు జాలివేసింది. "మీ కెందుకంత

భయం? నాలో ఏదో జబ్బుందని చెప్పా ననుకోండి. దాన్ని రహస్యంగానే ఉంచ టంలో మీకు శ్రమలేదే! ఎందుకంతగా భయపడుతున్నారు?"

కులశేఖర్ నవ్వాడు. ఆ తరువాత అతడి వదనంలో ప్రసన్నత చోటు చేసుకున్నది.

"అలాగే. మీరు చెప్పే విషయాన్ని రహస్యంగానే ఉంచుతానని వాగ్దానం చేస్తున్నాను" అన్నాడు.

నీరజ లోపలికి వెళ్ళి ఒక పాత కవరు అతడికి అందించింది. కవర్ నలిగిపోయి ఉంది. అడ్రస్ లేదుగాని పైన నీరజ అని మాత్రం రాసిఉంది.

రెండు అరఠావు సైజు కాగితాల్ని బైటికి తీశాడు. అతడికి అర్థం కాలేదు. ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూచాడు. "చదవండి" అందామె మెల్లగా.

"ప్రమీల ఎవరు?" అని అడిగాడు క్రింద సంతకం చూచి.

ఆమె చెప్పింది.

కులశేఖర్ ఉత్తరాన్ని మడుస్తూ అన్నాడు. "మీ నోట ఆ రహస్యం వింటాను. మూడవవ్యక్తి ఉత్తరంద్వారా వినటంలో అర్థంలేదు. మీరు చెప్పండి."

నీరజ ఆశ్చర్యంతో అతడివైన చూచి మెల్లగా అంది "అది నా శీలానికి సంబం ధించిన విషయం."

"ఫరవాలేదు. చెప్పండి. నేను మాట ఇచ్చాగా" అన్నాడు.

నీరజ నిట్టూర్చి ప్రారంభించింది. "నాల్గు సంవత్సరాలక్రితం...."

ప్రమీల అంటుంది "నీరజా- అతడి కోర్కె తీరాలి-నీకు ఉద్యోగం రావాలి."

నీరజకు అర్థంకాలేదు. బిక్కచచ్చి చూస్తోంది.


ఆమె కాగితం పెన్ తెచ్చి నీరజకు అందించింది.

"రాయి- ఉత్తరం రాయి....నాలుగవ తారీకు రాత్రి తొమ్మిదిగంటలకు బ్లూనైల్ హోటల్ దగ్గర ఉంటాను" అని. నీరజ రాసింది. ఆమె కవర్‌లో పెట్టి మూసింది. "దీనిని తీసుకెళ్ళి రేపు ఇవ్వు."

ఆ తరువాత ఆమె చాలాసేపు నీరజకు బోధపరుస్తూనే ఉంది. ఆఖరుగా "సరేనా?" అని అడిగింది.

నీరజ ఆనందభాష్పాలు రాలుస్తూ "సరే" అంది. అతి ఉత్సాహంతో వెళ్ళి పోయింది.

నాలుగవ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు ఉమానాథ్ టాక్సీలోంచి దిగి లోపలికెళ్ళాడు. ఒక మూల టేబిల్ దగ్గర మసక వెల్గులో నీరజ కూర్చుని ఉంది. క్రొత్త కోటాచీర- లేతగులాబి రంగులోది- కట్టుకుని ఉంది. దాదాపు చెవులను మూస్తూ వెంట్రుకలు బాగా క్రిందుగా దువ్వుకున్నది. ఆ సన్నటి వాయిద్య సంగీతంలో- ఆ వాతావరణంలో- ఎదురుగా ఉన్నది




అనాఘ్రాత పుష్పం! అతడిలోని కోరిక పురివిప్పుకున్నది.

"మై డియర్ నీరజా. ఏమిటి తీసుకుందాం.... నీ వెంత...." అతడి మాటల్ని త్రుంచివేస్తూ అంది "సార్. నాకు ఏమీవద్దు. నన్ను మాట్లాడించకండి. నేను మాట్లాడను. ఏ షరతుతో వచ్చానో మీకు తెలుసు. మనస్ఫూర్తిగా ఆనందించటానికి రాలేదు. మీరు తినండి. ప్లీజ్ నన్ను మాట్లాడించి చిత్రవధ చేయకండి."

ఉమానాధ్ భుజాలెగరేసి కూర్చున్నాడు. అరగంటలో తినటం త్రాగటం పూర్తిచేశాడు. క్షణక్షణం- అతడి కళ్ళలో కోరిక- విజృంభిస్తోంది- ఇది మొదటి సారి- ఇంత సులభంగా పని సానుకూలమవుతుందని అతడికి తెలియదు- ప్రమీల ఎన్నటికి తెలుసుకోలేదు. ఆఫీసర్లకు ఇది మామూలు.... నాప్‌కిన్‌తో మూతి తుడుచుకుంటూ ఆమె వెనకాతలగా వెళ్ళి భుజాలమీద చేతులువేసి చెవికి దగ్గరగా వంగాడు. చందనం పరిమళం ముక్కుపుటాలను సోకింది. అతడు మత్తుగా ఆఘ్రాణిస్తూ "రా.... వెళ్దాం.... రూం ... ముఫ్పై రెండు....కదూ" అతడి చేతులు భుజాలమీద ఉన్నంతసేపు ఆమె బిగిసిపోయి కూర్చుని ఉంది. అతడు లేవగానే ఆమె లేచి నంచున్నది. అతడి వెంట భయంభయంగా దిక్కులు చూస్తూ నడుస్తోంది. ఆ హోటల్ డిమ్‌లైట్స్‌లో ఎవరు ఎవర్నీ పట్టించుకోవటంలేదు.

నీరజ మెల్లగా అంది. "సార్.... గదిలో లైటు ఒద్దు" అతడు హాయిగా నవ్వాడు. "ఓ.... కె.... నీవు ఒద్దు అంటే

ఒద్దు.... సరేనా?" ఆమె నడుంచుట్టూ చేయి వేయబోయాడు. "ప్లీజ్–" అంది కాస్త తగ్గి.

కారిడార్‌లో దీపం సన్నగా వెలుగుతోంది. ముప్పై రెండు గది ముందర నుంచుని తాళంతీశాడు. లోపల చీకటిగా ఉంది. కిటికీకి దిట్టమైన తెరలు వ్రేలాడుతున్నాయి. వెంటిలేటర్ నుండి లేత వెన్నెల వెలుగు ప్రసరిస్తోంది గదిలో వస్తువులు నీడల్లా కనిపిస్తున్నాయి. కారిడార్‌లో లైటు వెలుగుతోంది.

"లైట్ వేసి ఓ మారు చూస్తాను. ఏమేమి ఉన్నాయో....."

"సార్.... ఒద్దు.... నాకు ప్రామిస్ చేశారు. ఒక్క గంట...." ఆత్రంగా అంది. ఉమానాధ్ లోపలికి వెళ్ళాడు. కారిడార్‌లో లైట్ ఆరిపోయింది. "అయ్యో" అంది నీరజ.

"భయం లేదు.... ఇక్కడ.... ఇటు రా...." ఉమానాధ్ అంటున్నాడు.

తలుపు గడియ వేసిందామె. ఎంతకూ తన దగ్గరకు రాకపోతే ఉమానాధరావు తడుముకుంటూ వెళ్ళాడు. ఆమెను సమీపిస్తోంటే చందనం సువాసన అతణ్ణి వివశుణ్ణి చేసింది. నీరజా అంటూ కదలకుండా నుంచున్న ఆమెను సమీపించాడు.

క్రొత్త కోటా చీర అతడి చేతికి తగిలింది.

కారిడార్‌లో లైట్ వెలిగింది.

ఆ గదిలో రెండు నీడలు మాత్రం కనబడుతున్నాయి. ఆమె ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. చెవులను కప్పుతూ దువ్విన జుత్తు చేతులకు మెత్తగా సోకింది.... నీరజ కారిడార్ లైట్ వేసి పరుగు పెట్టినట్లు క్రిందికి వచ్చింది. తను– ప్రమీల తీసుకున్న గదిలోకి వచ్చి తమ ప్లాన్ విజయవంతమైనందుకు ఎనలేని ఆనందంతో మంచం మీద వ్రాలింది. మరి కాసేపటికి ఆమె పట్టరాని దుఃఖంతో తలగడలో ముఖం దాచుకుంది. లోకందృష్ట్యా తను చౌకబారు మనిషి.... "ఇది నా కథ" అంటూ ముగించింది. నమ్మలేకపోతే చదవండి. లేక ఆమెవద్దకు వెళ్దాం" అంది.

"నీరజా. నమ్ముతున్నాను. కాని ఆ ఉత్తమ ఇల్లాల్ని చూడాలని ఉంది.... వెళ్ళివద్దామా?" అంటూ లేచాడు. నీరజ అత్యంతానందంతో అతడివెంట బయలుదేరింది.

